# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విజయదశమి పండుగను దేశ ప్రజలు ఈరోజు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు.
- ❖ ప్రతీ ఒక్కరూ ఖాదీ వినియోగాన్ని ప్రోత్సహించాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా కోరారు.
- ❖ సర్ క్రీక్ ప్రాంతంలో పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.
- ❖ వెస్టిండీస్ తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ లో భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది.
- ❖ బంగాళాఖాతంలోని వాయుగుండం దక్షిణ ఒడిశా తీరంలోని గోపాల్‌పూర్ సమీపంలో కొద్ది సేపటి క్రితం తీరం దాటిందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది.

=======================

విజయదశమి పండుగను దేశ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. ఈరోజుతో నవరాత్రులు ముగియడంతో దేశ వ్యాప్తంగా దుర్గా పూజ, నిమజ్జన వేడుకల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచిస్తూ రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయాన్ని గుర్తు చేసుకునేందుకు ఈ పండుగను ఏటా ఆశ్వయుజ మాసం శుక్ల దశమి నాడు జరుపుకుంటారు. ఢిల్లీ ఎర్రకోటలోని మాధవ్ దాస్ పార్క్ లో జరిగిన దసరా వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. ఇక ఢిల్లీలో ఐపీ ఎక్స్ టెన్షన్ రామ్‌లీలా కమిటీ నిర్వహించిన దసరా వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. అలాగే దసరా వేడుకలకు ఖ్యాతి గాంచిన కోల్ కతా నగరం ఈరోజు కోలాహలంగా మారింది. అక్టోబర్ 5న కోల్‌కతాలో దుర్గా పూజ కార్నివాల్ జరగనుంది. అంతర్జాతీయ ప్రేక్షకుల సమక్షంలో కొన్ని ఉత్తమ పూజా మండపాల నుండి విగ్రహాలను ఆ రోజు ప్రదర్శిస్తారు.

=======================

ఖాదీ గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తుల విక్రయాలు గత 11 సంవత్సరాల్లో 5 రెట్లు పెరిగాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన ఈరోజు న్యూఢిల్లీలోని ఖాదీ గ్రామోద్యోగ్ భవన్‌లో `జీఎస్టీ బచత్ ఉత్సవ్` పేరిట ఖాదీ ఉత్పత్తులపై దేశ వ్యాప్తంగా తగ్గింపు విక్రయాలను ప్రారంభించారు. ఖాదీ మహోత్సవ్ 2025లో భాగంగా ఈరోజు నుండి నవంబర్ 5వ తేదీ వరకు వినియోగదారులకు ఖాదీ వస్త్రాలపై 20 శాతం, ఖాదీ గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులపై 10 శాతం తగ్గింపు ఇవ్వబడుతుంది. ఇక ప్రారంభం అనంతరం అమిత్ షా పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశ ప్రజలందరూ ఖాదీ వినియోగాన్ని ప్రోత్సహించాలని.. తద్వారా స్వదేశీ ఉత్పత్తులను తయారు చేసే వారికి ఊతమందించాలన్నారు. సంవత్సరానికి ప్రతి ఒక్కరూ కనీసం 5 వేల రూపాయల విలువైన ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

(వాయిస్ 31 సెకన్లు)

======================

జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా దేశ ప్రజానీకం ఈరోజు ఆయనకు నివాళులర్పించింది. విదేశాల్లో కూడా భారత మిషన్లు పలు కార్యక్రమాలను నిర్వహించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీ సమాధి వద్ద సర్వ ధర్మ ప్రార్థన సభను నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, లోక్ సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ ఉదయం రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి పుష్పగుచ్ఛాలతో నివాళి అర్పించారు.

======================

సర్ క్రీక్ ప్రాంతంలో పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈరోజు గుజరాత్ భుజ్‌లోని సైనిక కేంద్రంలో శస్త్ర పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన సైనికులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో లేహ్ నుండి సర్ క్రీక్ మధ్య భారతదేశంలోకి చొరబడేందుకు పాకిస్తాన్ తీవ్రంగా ప్రయత్నించి విఫలమైందని చెప్పారు. దీనికి ప్రతిస్పందనగా, భారత సైన్యం పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థను పూర్తిగా నియంత్రణలోకి తీసుకుందని.. అలాగే భారత్ ఎప్పుడైనా, ఎక్కడైనా సమర్థవంతమైన దాడులు చేయగలదని ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపిందన్నారు.

(వాయిస్ 32 సెకన్లు)

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చి అభివృద్ధికి కీలక చోదక శక్తిగా మార్చిన ప్రయాణంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 110 సెకన్లు)

======================

ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ECMS) కింద లక్షా 15 వేల 351 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తూ ప్రభుత్వానికి దరఖాస్తులు అందాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్విని

వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులకు ఆ వివరాలను మంత్రి వెల్లడిస్తూ... ఈ పథకం కోసం 59 వేల 350 కోట్ల రూపాయల పెట్టుబడులను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, కానీ లక్షా 15 వేల కోట్లకు పైగా విలువైన దరఖాస్తులు అందాయని హర్షం వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వంపై ఏర్పడిన విశ్వాసంతోనే నేడు పెట్టుబడులు, ఉద్యోగాలు పెరుగుతున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

బంగాళాఖాతంలోని వాయుగుండం దక్షిణ ఒడిశా తీరంలోని గోపాల్‌పూర్ సమీపంలో కొద్ది సేపటి క్రితం తీరం దాటిందని భారత వాతావరణ విభాగం (ఐ.ఎం.డి) తెలిపింది. తీరం వెంబడి గంటకు 65 నుండి 75 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయని... దీని ప్రభావంతో దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తర కోస్తాంధ్రలలో ఈరోజు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

=======================

వెస్టిండీస్ తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ లో భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ప్రారంభమైన మొదటి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ బాట్స్ మెన్ లను కేవలం 44 ఓవర్లలోనే 162 పరుగులకు ఆలౌట్ చేయగలిగింది.

=======================
=======================